క్లుప్తంగా

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని మూలపేటలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. మంగళవారం మొల్లేటి సోమ శంకరరావు ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.5,016 విరాళం సర్పంచ్ గంగప్పలనాయుడు, కమిటీ సభ్యుడు కాశీరావుకు అందజేశారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ గంగాలమ్మతల్లి గుడి నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

అచ్యుతాపురం : జూలై ఒకటో తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాక్షితో మాట్లాదారు. మండలంలో 11,112 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తామని తెలిపారు. సుమారు 110 మంది సచివాలయ సిబ్బందితో ఈ పింఛను పంపిణీ కార్యక్రమాన్ని తొలి రోజే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రాయితీపై విత్తనాలు సిద్ధం

కోటవురట్ల : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి భీమిరెడ్డి సరోజిని తెలిపారు. మండలానికి ఆర్‌జీఎల్ 2537 రకం 552 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 రకం 133 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 23 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 40 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 9 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం 5.4 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 1.5 క్వింటాళ్లు వచ్చినట్టు తెలిపారు. ఈ విత్తనాలను కిలోకి రూ.10 రాయితీపై అందిస్తున్నట్టు తెలిపారు. కావలసిన రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలని సూచించారు.

మురుగు కూపాలుగా సీసీ రోడ్లు



తంగేడులో అధ్వానంగా సీసీ రోడ్డు

కోటవురట్ల : తంగేడులోని పలు సీసీ రోడ్లు మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యం లోపించడంతో రోగాలు ముసురుకుంటున్నాయి. డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరు రోడ్లపై ప్రవహించి మురుగు కూపం తయారైంది. సీసీ రోడ్లు ఉన్నా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పొడవునా అధ్వానంగా ఉన్న సీసీ రోడ్డుపై ఇక్కట్లు తప్పడం లేదని చెబుతున్నారు. వర్షాకాలంలో దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని, రోడ్డంతా మురుగుకూపంగా మారి నాచుపట్టి జారిపడుతున్నామని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అధికారులు స్పందించి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన సుజాతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్ : యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కె.సుజాత ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఈమె మహేంద్ర తనయ నదిలో మత్స్య వైవిధ్యంపై పరిశోధనలు చేశారు. ముఖ్యంగా మిస్టస్ గులియా చేప ప్రత్యేకతపై అధ్యయనం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుజాతను ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

రైళ్ల సర్వీసులు పునరుద్ధరించాలి

- రద్దు చేసిన పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరించాలి
- యలమంచిలిలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా



యలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

యలమంచిలి : రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ పనుల పేరుతో రైళ్ల రాకపోకలను నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం వెంటనే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ యలమంచిలి నియోజకవర్గ సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం యలమంచిలి రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి విజయవాడ మీదుగా వెళ్తున్న రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిత్యం పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వలస కార్మికులు ప్రతి రోజు వేలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారని, వీరందరికీ అందుబాటులో ఉండే రైల్వే సర్వీసులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం ద్వారా ప్రయాణికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జనరల్ బోగీల సంఖ్యను ప్రభుత్వం ఇప్పుడు తగ్గించగా సాధారణమైన వారికి అందుబాటులో ఉండే స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించి ఏసీ బోగీలను పెంచడం ద్వారా సామాన్య ప్రజలకు ప్రయాణ సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం దూరం చేసిందని, తాజాగా ఆధునికీకరణ పేరుతో విశాఖ నుంచి విజయవాడ వెళ్లే పాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సింహాద్రి, రత్నాచల్, ఉదయ్, మచిలీపట్నం, గుంటూరు, రాయగడ రైళ్లను తరచూ నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుతున్నారని అన్నారు. రాంబిల్లి సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఇతర రవాణా వాహనాల కంటే రైల్వే ఛార్జీలు తక్కువ కావడంతో పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలు రైళ్ల ప్రయాణానికే మక్కువ చూపుతారని, అటువంటి తరుణంలో రైళ్లను ప్రభుత్వం రద్దు చేయడంతో రోజుకు 10 వేల మందికి పైగా ప్రయాణికులు సమస్యలతో సతమతవుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విజయవాడ విశాఖ మధ్య రైళ్లను పునరుద్ధరించాలన్నారు. వందే భారత్‌కు అనకాపల్లి స్టేషన్‌లో హాల్ట్ కల్పించాలని, విశాఖ నుంచి ముంబై వెళ్లి వచ్చే ఎల్‌టీటీకి, విశాఖ నుంచి హైదారాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు వందేభారత్ అనకాపల్లిలో హాల్ట్ కల్పించాలని, రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, సిహెచ్.శివాజీ, రాము, రామకృష్ణ, రంగారావు, రాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, కేశవ్, అప్పలరాజు పాల్గొన్నారు.

డయేరియాపై రెండు నెలల అవగాహన కార్యక్రమం



ఖాజీపాలెం వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేస్తున్న దృశ్యం



దుప్పితూరు పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : డయేరియా నివారణకు రెండు నెలల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు మండల అధికారులు. ఈ క్రమంలో ఎంపీడీవో సురేష్‌కుమార్ పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నీటి కాలుష్యం వల్ల డయేరియా వచ్చే అవకాశం ఉన్నందున తాగునీటిని శుద్ధి చేసేందుకు, కాసింత వేడి చేసిన నీటిని తాగాలంటూ విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు మంగళవారం చేపట్టారు. మరోవైపు వాటర్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు.

‘వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు వద్దు’



విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు వద్దంటూ ఆందోళన చేస్తున్న రైతులు

మునగపాక : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయడం తగదంటూ రైతు సంఘాల నాయకులు ఆందోళన చేశారు. మునగపాకలో తంపరమూల ప్రాంతంలో అధికారులు విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత బ్రహ్మజీ, రైతు సంఘ ప్రతినిధి కర్రి అప్పారావు మాట్లాడుతూ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటుచేయడం ద్వారా రైతులు ఉచిత విద్యుత్ కోల్పోతారన్నారు. ఇప్పటికే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతుంటే మీటర్లు ఏర్పాటు చేయడం తగదన్నారు. అధికారులు మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు నూక నరసింగరావు, ఆదిశివ, అప్పారావు, భీము నాయుడు, కోటి, రమణబాబు గోవింద పాల్గొన్నారు.

పాల సంఘం అధ్యక్షునిగా అప్పారావు



అప్పారావును అభినందిస్తున్న పప్పల

రాంబిల్లి : హరిపురం పాల సంఘం అధ్యక్షునిగా ధూళి అప్పారావు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికలో గెలుపొందిన అప్పారావును మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టీడీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ధూళి రంగనాయకులు తదితరులు అభినందించారు. పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని అప్పారావు అన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించాలి

నర్సీపట్నం: అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్‌పై వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. క్యాన్సర్‌ను వివిధ లక్షణాల ద్వారా గుర్తించవచ్చన్నారు. సక్రమంగా బరువు తగ్గడం, జ్వరం, నిర్దిష్ట ప్రాంతంలో నొప్పి, అలసట, మహిళలో రొమ్ము ఆకారం లేదా రంగులో మార్పు, రుతుచక్ర కాలం నుంచి రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వెంటనే వైద్యులను సంప్రదించి వైద్యం పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మిని, రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, దంత వైద్యురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్ ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామని ప్రిన్సిపాల్ పీపీఎస్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు నేరుగా మోడల్ స్కూల్‌కు వచ్చి జాయిన్ అవ్వాలని ఆమె కోరుతున్నారు. మరిన్ని వివరాలకు 8106521277 ఫోన్ నంబరును సంప్రదించాలని శ్రీలక్ష్మి కోరారు.

ఎమ్మెల్యే సుందరపు దృష్టికి మండల సమస్యలు

మునగపాక : గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారం అవుతుందని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో కూటమి నేతలు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. విజయకుమార్ విజయోత్సవ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించేలా సహకరించాలన్నారు. సమావేశంలో నేతలు కర్రి సాయికృష్ణ, దొడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం ద్వారా సాగునీటి పనులు



ఉపాధి హామీ నిధులతో తవ్విన సాగు నీటి కాలువ

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెంలో ఉపాధి హామీ పథకం కింద సాగునీటి పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సాగునీటి చెరువుల పూడికతీత, వాటికి గట్లు పటిష్టం చేయడం, పంట కాలువలు పూడిక తీసి శుభ్రపరచడం, ట్రెంచ్‌ల తవ్వకం తదితర పనులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇవి సాగుకు ఉపయోగపడటమే కాకుండా కూలీలకు ఉపాధి లభిస్తుందని ఉపాధి పథకం ఏపీవో శివ తెలిపారు.

బడి బస్సు సర్వీసులు పెంచాలని వినతి



బడి బస్సుల సంఖ్య పెంచాలని వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్ : విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా బడి బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యలమంచిలి డివిజన్ నాయకులు కోరారు. మంగళవారం ఈ మేరకు వినతిపత్రాన్ని యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం అధికారులకు వారు అందజేశారు. యలమంచిలి నియోజకవర్గ కేంద్రంలో వివిధ స్కూళ్లు, కాలేజీలకు ప్రతి రోజూ సుమారు 5 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారని కానీ బస్సు సర్వీసులు మాత్రం చాలా పరిమితంగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ యలమంచిలి డివిజన్ కార్యదర్శి శివ అన్నారు. అలాగే రాంబిల్లి మండలం దిమిలి,గోకివాడ తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడం వల్ల విద్యార్థులు కళాశాలలు, స్కూళ్లకు చేరుకోవడానికి ప్రతి రోజూ తీవ్ర ప్రయాస పడుతున్నారన్నారు. దీంతో పాటు రవాణా ఛార్జీలకు ప్రతి రోజూ రూ.100 ఖర్చవుతోందని, ఇది పేద కుటుంబాల విద్యార్థులకు చాలా భారమౌతోందన్నారు. ఆర్థిక భారం దృష్ట్యా పలువురు విద్యార్థులు ప్రతి రోజూ కళాశాలలకు హాజరు కాలేకపోతున్నారన్నారు. విద్యార్థుల సమస్యల దృష్ట్యా ప్రభుత్వం, ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం బాలాజీ, సురేష్, శ్రీను, రోహిణి తదితరులు కోరారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం



మళ్ల మాణిక్యం,ప్రిన్సిపాల్

యలమంచిలి రూరల్ : కొక్కిరాపల్లి అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యకు తీసుకుంటున్నామని స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం మంగళవారం మీడియాకు తెలిపారు. తమ పాఠశాలలో 6వ తరగతిలో ఎస్సీ కోటాలో 17, 7వ తరగతిలో ఎస్సీ కోటాలో 3,బీసీ కోటాలో ఒకటి, 8వ తరగతిలో ఎస్సీ కోటాలో 7,ఎస్టీ కోటాలో ఒకటి,9వ తరగతిలో ఎస్సీ కోటాలో 5 చొప్పున మిగులు సీట్లు ఉన్నాయన్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ వివరాలు, కులం, ఆదాయం సర్టిఫికెట్‌లతో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను తమ పాఠశాల కార్యాలయంలో స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్నవారిలో అర్హులకు ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు.

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం

డుమా పీడీ సందీప్



మాట్లాడుతున్న డుమా పీడీ సందీప్

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ (డుమా) పీడీ సందీప్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మునగపాక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంలోని ఉద్యాన పంటల సాగుకు విలీనం చేయడం ద్వారా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. రైతులకు మేలు చేకూరడంతో పాటు కూలీలకు కూడా ఉపాధి దొరుకుతుందన్నారు. పంటల సాగుకు ఈ విలీన కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటల మొక్కలు పంపిణీ చేయాలన్నారు. అయిదు ఎకరాల లోపు ఉన్న రైతులకు తప్పనిసరిగా పండ్ల తోటల మొక్కలు అందించాలన్నారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయన్నారు. ఏపీవో ఎరకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీడీ మణికుమార్, అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసిన హోంమంత్రి



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా రైతులకు వరి విత్తనాలు పంపిణీ ప్రారంభించారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమీక్ష సమావేశం అనంతరం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేసి ప్రారంభించారు. రైతులకు సకాలంలో వరి విత్తనాలు అందరికీ అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పలు సంఘాల నాయకుల వినతి

నక్కపల్లి/ఎస్.రాయవరం : ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దని, బోధన మాతృభాషలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ నేతలు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం అనితను ఆమె స్వగృహంలో కలిసి వినతి అందించారు. నోబుల్ టీచర్స్ అసోసేషియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రమణ, కార్యదర్శి శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయలు హోంమంత్రిని కలిసి తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే అమలు చేయాలని కోరారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు డీవీరామారావు, గొట్టుముక్కల వరప్రసాద్ తదితరులు హోంమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సత్కరించారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, అసంపూర్తిగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ భవనానికి నిధుల కేటాయించాలని కోరారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్, న్యాయంపూడి ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు తదితరులు హోంమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రాంబిల్లి : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వీఆర్ఏలు హోం మంత్రి అనితను కోరారు. ఈ మేరకు ఆమెను మంగళవారం నక్కపల్లిలో కలిసి వినతిపత్రం అందజేసినట్టు వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు, రాంబిల్లి మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు తెలిపారు. వీఆర్ఏల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

30 సిమెంట్ బస్తాల చోరీ

అనకాపల్లి: మండలంలోని బీఆర్టీ కాలనీలో జగనన్న కాలనీ కోసం షెడ్డుల్లో భద్రపరిచిన 30 సిమెంట్ బస్తాలు చోరీకి గురైనట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. దీనిపై సైట్ ఇంజినీర్ అంజిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.

ఎమర్జెన్సీ.. ఓ చీకటి అధ్యాయం

- ఆ పాలనను ఎప్పటికీ మరువలేం
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ
- బీజేపీ సీనియర్ నాయకుడు యర్రంశెట్టి సత్యారావు



సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న యర్రంశెట్టి సత్యారావు

అనకాపల్లి : దేశంలో ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయమని బీజేపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత అధ్యాపకుడు యర్రంశెట్టి సత్యారావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నాటి కాంగ్రెస్ పాలనను ఎప్పటికీ మరువలేమన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఎంపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సమయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతూ ఎంతోమంది దేశభక్తులు జైలుకు వెళ్లారన్నారు. అలాంటి చీకటి రోజులు ఎప్పటికీ రాకూడదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మోదీ పాలనలో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని, ఇతర దేశాలతో మన దేశం పోటీ పడుతోందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జీవీవీ సత్యనారాయణ, ఓబీసీ రాష్ట్ర నాయకులు కర్రి రామకృష్ణ, ఎమర్జెన్సీ వ్యతిరేక దిన కార్యక్రమం ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, మండల నాయకుడు నర్సింగ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆ చీకటి రోజులు మళ్లీ రాకూడదు

కశింకోట: ఎమర్జెన్సీ వ్యతిరేక దినాన్ని స్థానిక వివేకానంద కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలం నాటి చీకటి రోజులు పునరావృతం కాకూడదన్నారు. సీనియర్ నాయకుడు, సంఘ సంస్కర్త వై.సత్యారావు ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యుడు గండి వెంకట సత్యనారాయణరావు, కళాశాల కరస్పాండెంట్ మళ్ల జగదీష్, ఎమర్జెన్సీ ఉద్యమంలో పాల్గొన్న నాయకులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టాలి



వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న చిన్నియాదవ్ తదితరులు

అనకాపల్లి: పట్టణ పరిధిలో మినీ వాటర్ ట్యాంక్‌ల ద్వారా ప్రజలకు తాగునీటిని పంపిణీ చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక విజయరామరాజుపేట శ్రీకృష్ణమందిరం మినీవాటర్ ట్యాంక్ మరమ్మతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున జీవీఎంసీ అధికారులు మంచినీటి పథకాలను శుభ్రం చేసి, పైపులైన్ల ద్వారా సరఫరా చేయాలని కోరారు. పైపులైన్లు లీకులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, నంబారు నూకరాజు, బొట్ట మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యుడికి పురస్కారం

కశింకోట: కశింకోటకు చెందిన జ్యోతిష్యుడు ఎస్.వి.ఎ. నాగేశ్వరరావుకు ఇంటర్నేషనల్ ఆస్ట్రో ఎక్సలెన్స్ పురస్కారం లభించింది.

ఘనంగా పైడితల్లమ్మ పండగ



రాంబిల్లి : మండల కేంద్రంలో మంగళవారం పైడితల్లమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

వర్షంతో ఊరట

మునగపాక : మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఊరట చెందారు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో సతమతమవుతున్న ప్రజలు ఈ అకాల వర్షానికి సేద తీరారు. మోస్తరు వర్షం కురిసింది. రైతులు, ప్రజలు వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పంటలకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి దుక్కులు చేసుకునేందుకు ఈ వర్షం మేలు చేస్తుందని తెలిపారు.